

మానకొండూర్‌లో రెండో రోజు నిమజ్జనానికి బారులు తీరిన గణేష్ ప్రతిమలు

ప్రశాంతంగా గణేశ్ నిమజ్జనోత్సవం

- మానకొండూర్, కొత్తపల్లి చెరువు, చింతకుంట కెనాల్‌లో 1,754 విగ్రహాల నిమజ్జనం

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 17: నగరంలో గణేశ్ నిమజ్జనోత్సవం ప్రశాంతంగా జరిగింది. మానకొండూర్ చెరువులో 720, కొత్తపల్లి చెరువులో 495, చింతకుంట కెనాల్‌లో 539 విగ్రహాలు, మొత్తం 1,754 మంగళవారం ఉదయం వరకు నిమజ్జనం చేశారు. జిల్లా రెవెన్యూ, నగరపాలక సంస్థ, పోలీసు, విద్యుత్‌శాఖ అధికారుల సమన్వయంతో ప్రశాంతంగా నిమజ్జనం జరిగిందని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన అందరికీ మేయర్ కృతజ్ఞతలు తెలిపారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఇతర శాఖల అధికారులను సమన్వయం చేసుకుని నిమజ్జనం జరిగే మూడు ప్రాంతాలతోపాటు టవర్‌సర్కిల్, రాంనగర్, మంకమ్మతోట వేదికల వద్ద కూడా అన్ని ఏర్పాట్లు చేయడంతో ఎక్కడా అవాంఛనీయ సంఘటన జరుగలేదని అన్నారు. గణేశ్ విగ్రహాలను నిమజ్జనం చేసిన చోట వ్యర్థాలను నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తొలగిస్తున్నామని, రెండు రోజుల్లో వ్యర్థాల తొలగింపు పూర్తవుతుందని చెప్పారు. నిమజ్జనోత్సవంలో నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్‌బాజ్‌పాయి ప్రత్యేక చొరవ తీసుకుని పర్యవేక్షించారని, అధికారులు, సిబ్బంది, కార్మికులంతా కష్టపడి పనిచేశారంటూ అభినందనలు తెలిపారు.

రెండో రోజు కొనసాగిన నిమజ్జనం

మానకొండూర్: మానకొండూర్ చెరువులో సోమవారం ఉదయం నుంచి చిన్న, చిన్న విగ్రహాలతో మొదలైన నిమజ్జనం మంగళవారం 12.47కు పూర్తయింది. చెరువు కట్టపై రాత్రి రెండు భారీ క్రేన్లతో విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఉదయం కట్టపై పెట్టిన క్రేనుతో సహా క్రీడాప్రాంగణం వద్ద మూడు క్రేన్ల సహయంతో చిన్న విగ్రహాలను నిమజ్జనం చేయడానికి అధికారులు ఏర్పాటు చేశారు. కరీంనగర్‌కు చెందిన గణేష్ విగ్రహన్ని క్రేను గొలుసులకు పెట్టే సమయంలో అదుపు తప్పి కిందపడిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఉదయం ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో కరీంనగర్ వెళ్లే వాహనాలను మండల కేంద్రంలోని పల్లెమీద బస్టాండ్ నుంచి ముంజంపల్లి, తిమ్మాపూర్ మండలంలోని పొరండ్ల, తిమ్మాపూర్, ఎల్‌ఎండీ, అల్గునూర్ మీదుగా దారి మళ్లించారు. ఇన్‌చార్జి సీఐ కర్రె స్వామి ఆధ్వర్యంలో 100 మందికి పైగా పోలీసులు, 50 మంది వలంటీర్లు బందోబస్తు నిర్వహించారు.

లక్షల్లో పలికిన లడ్డూలు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబర్ 17: విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగరంలో పలు చోట్ల నిర్వహించిన వేలాల్లో లడ్డూలు లక్షల్లో పలికాయి. సూర్యనగర్ వినాయక మండపంలో ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ యజమాని కొత్త సతీశ్‌రెడ్డి కూతురు హవిషరెడ్డి 2,55,555 రూపాయలకు లడ్డూదక్కించుకున్నారు. లక్ష్మీనగర్ ఫ్రెండ్స్ యూత్ క్లబ్ వినాయక మండపంలో పాకనాటి లక్ష్మీకల్పన 2.26 లక్షలకు లడ్డూ కైవసం చేసుకున్నారు. ప్రశాంత్ నగర్ వినాయకమండంలో వెంకటేశ్వర్ 2,00,016 రూపాయలకు లడ్డూ దక్కించుకున్నారు. విద్యా నగర్ విజయ దుర్గ కాలనీలో మండ పం వద్ద సంజు అశోక్ దంపతులు 1.25 లక్షలకు లడ్డూ సొంతం చేసుకున్నారు. రాం నగర్ ఛాలెంజ్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో మండపంలో కొత్తపల్లి మండలం కమాన్ పూర్ గ్రామానికి చెందిన వేల్పుకొండ రాజ్‌కుమార్ యాదవ్ 51 కిలోల లడ్డూను 1,25,016



సూర్యనగర్‌లో వేలంలో లడ్డూ చేజిక్కించుకున్న కొత్త సతీశ్‌రెడ్డి కూతురు హవిషరెడ్డి

రూపాయలకు చేజిక్కిచ్చుకున్నారు. కోతి రాంపూ ర్‌లో మండపం వద్ద కొరివి కిషన్ 50 వేలకు లడ్డూ సొంతం చేసుకు న్నారు. కొత్తపల్లిలో తూర్పువాడ వాసిరెడ్డి యూత్ వినాయక మండపంలో కలకొండ మల్లారెడ్డి 56,116 రూపాయలకు లడ్డూ చేజిక్కించుకున్నారు.

- **మానకొండూర్:** మానకొండూర్‌లోని గడివాడ యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద నిర్వహించిన వేలంలో 71,116 రూపాయల ఈరమల్ల పద్మ-మల్లయ్య దంపతులు లడ్డూ దక్కించుకున్నారు.



జెండా వందనం చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు



జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు



ప్రసంగిస్తున్న మంత్రి

అస్తిత్వ పోరాటానికి ప్రతీక.. తెలంగాణ

- అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యం
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- ఘనంగా ప్రజా పాలన దినోత్సవం

కరీంనగర్, సెప్టెం బరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'తెలంగాణ రాష్ట్రం భౌగోళిక స్వరూపం మాత్రమే కాదు. ఇది ఒక అస్తిత్వ పోరాటానికి ప్రతీక. తెలంగాణ ప్రాంతంలో స్వేచ్ఛ, స్వాతంత్ర్యాల కోసం దశాబ్దాలుగా పోరాటాలు కొనసాగాయి. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నుంచి మిలియన్ మార్చ్ వరకు అనేక ఉద్యమాలు ఇక్కడ ఊపిరిపోసుకున్నాయి. మలిదశ తెలంగాణ పోరాటం కొత్త పుంతలు తొక్కి, మరింత సమర్థవంతంగా ప్రజల మదిలోకి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం వేగంగా వెళ్లింది. దీంతో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్షల మేరకు జూన్ 2, 2014 సంవత్సరంలో తెలం గాణ రాష్ట్ర ఏర్పాటును ప్రకటించింది. భారత భౌగోళిక చిత్రపటంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించింది' అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా మంత్రి, అధికారులు నగరంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద మంగళవారం నివాళులర్పించారు. అనంతరం పోలీసు పరేడ్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సెప్టెంబరు 17, 1948 సంవత్సరంలో తెలంగాణ ప్రాంతం నిజాం చెర నుంచి విముక్తి పొంది, అఖండ భారత్‌లో విలీనమైందన్నారు. ఇంతటి ప్రాముఖ్యం ఉన్నన సెప్టెంబరు 17న 'తెలంగాణ ప్రజా పాలనా దినోత్సవం' నిర్వహించా లని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఆనాడు పోరాటంలో పాల్గొన్న మహానుభావులందరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని చెప్పారు.

ఈ సంవత్సరం నుంచి పంటల బీమా

రైతులకు పంటలబీమా పథకం వర్తింపజేయడానికి ఈ సంవత్సరం నుంచి ఫసల్ బీమా యోజన పథకంలో చేరాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ పథకం కింద రైతుల తరఫున బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. వ్యవసాయ, రైతు సంక్షేమానికి ప్రభుత్వం తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. అంగన్‌వాడీలను ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మార్చబోతున్నామని, ప్రాథమిక పాఠశాలలు మొదలు విశ్వవిద్యాలయాల వరకూ నాణ్యమైన విద్యాబోధన, నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పనకు మిషన్ మోడ్ లో చేయాలని ప్రభుత్వం సంకల్పించిందని తెలిపారు. పాఠశాలలు తెరిచిన రోజునే పిల్లలందరికీ యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు అందజేశామని, అమ్మ ఆదర్శపాఠశాలల కమిటీల ద్వారా మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన

ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా రాష్ట్రంలో కొత్తగా తమ ప్రభుత్వం కొలువుదీరిందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో ప్రజాపాలన, పారదర్శక పాలన సమాజంలోని అన్ని వర్గాలకు స్వేచ్ఛా సామాజిక న్యాయం, సమాన అవకాశాలు దక్కాలననేదే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దార్శనిక పాలనలో అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధిని సాధిస్తున్నామన్నారు. అనతికాలంలోనే సంక్షేమ కార్యక్రమాల అమలులో దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నామ చెప్పారు.

పేదల కోసమే ఆరు గ్యారంటీలు

పేదలు, నిరుపేదలను దృష్టిలో పెట్టుకుని ఎన్నికలకు ముందు ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. వాటిని నిక్కచ్చిగా అమలు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. ప్రతి పేదవాడికి అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందాలనే లక్ష్యంతో, ప్రజాపాలన కార్యక్రమం చేపట్టి దరఖాస్తులు స్వీకరించామని చెప్పారు. డిసెంబర్ 28 నుంచి ప్రజాపాలన కార్యక్రమంలో జిల్లాలో 12,95,381 దరఖాస్తులు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టా మని తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా తెలంగాణ ఆడబిడ్డలకు రాష్ట్ర నలుమూలలకు ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఆర్టీసీ బస్సుల్లో ఉచి తంగా ప్రయాణించడానికి అవకాశం కల్పించామన్నారు. జిల్లాలో 15 డిసెంబరు 2023 నుంచి సెప్టెంబరు 12 వరకు 1.99 కోట్ల మంది మహిళలు ఉచిత రవాణా సౌకర్యాన్ని వినియోగించుకున్నారు. దీని ద్వారామహిళలకు 79.9 కోట్ల రూపాయల లబ్ధి చేకూరిందని తెలిపారు.

రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా పేదలకు ఉచిత వైద్యం

రాష్ట్రంలో నిరుపేదలు సైతం కార్పొరేట్ ఆసుపత్రికి వెళ్లి ఖరీదైన వైద్యాన్ని పొందాలన్న లక్ష్యంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ సాయాన్ని ఐదు లక్షల నుండి 10 లక్షల రూపాయలకు పెంచి అమలు చేస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. కొత్తగా 163 చికిత్సలను ఈ పథకంలో చేర్చామన్నారు. మొత్తం 1,837 చికిత్సలకు 10 లక్షల రూపాయల వరకు ఉచిత వైద్యం అందుతోందని, ఈ పథకంతో మన జిల్లాలో 15,302 మంది పేదలకు ఉచిత చికిత్స అందించామన్నారు. 500 రూపాయలకే వంట గ్యాస్ అందిస్తున్నామని, ఈ పథకంతో జిల్లాలోని 1.43 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరిందన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం 10.53 కోట్ల రూపాయల సబ్సిడీ అందజేసిందని తెలిపారు. 200 యూనిట్ల కంటే విద్యుత్ వాడే వారికి ఉచితంగా విద్యుత్ అందజేస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 1.62 లక్షల కుటుంబాలకు ఈ పథకంతో లబ్ధి చేకూరుతోందన్నారు. పేద, బడుగు వర్గాల సొంతింటి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పేరుతో నూతన గృహ నిర్మాణ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రతీ నియోజకవర్గంలో కనీసం 3,500 ఇళ్ల చొప్పున నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు.

ప్రతి నియోజకవర్గంలో ఓ ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల కోసం ప్రతి నియోజకవర్గంలో ఒకే ఆవరణలో 25 ఎకరాల స్థలంలో ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లను నిర్మించబోతున్నామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. రాష్ట్రాన్ని అన్ని రంగాలలో ముందుకు తీసుకువెళ్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, జిల్లా సర్వతోముఖాభివృద్ధికి నిర్మాణాత్మక సహకారం, సూచనలు అందిస్తున్న ప్రజాప్రతినిధులకు, అధికారులకు, అన్ని వర్గాల ప్రజలకు మంత్రి శ్రీధర్‌బాబు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ అభిషేక్ మోహంతి, అడిషనల్ కలెక్టర్లు లక్ష్మి కిరణ్, ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, మేయర్ సునీల్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేలు కవ్వంపెల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

రుణమాఫీ ద్వారా జిల్లాలో 71,109 మంది రైతులకు లబ్ధి

తమ ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు రెండు లక్షల రూపాయల వరకు రైతుల రుణాలను మాఫీ చేశామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. జిల్లాలో 71,109 మంది రైతుల ఖాతాల్లో రుణమాఫీ కింద 546.36 కోట్ల రూపాయలు జమ చేశామన్నారు. అర్హులైన రైతులందరికీ రైతు భరోసా పథకాన్ని ఎకరానికి 15 వేల రూపాయల చొప్పున అందించాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గతంలో అమలు జరిగిన రైతు బంధు పథకం కింద ఎకరాకు సంవత్సరానికి 10 వేల రూపాయలు మాత్రమే చెల్లించారన్నారు. ప్రభుత్వం విధి విధానాలు రూపొందించి త్వరలో రైతు భరోసా పథకం అమలు చేయబోతుందని చెప్పారు. రాష్ట్రంలో సన్నరకం వరి ధాన్యం సాగును ప్రోత్సహించే ందుకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

స్కిల్ యూనివర్సిటీలో విశ్వకర్మలకు ప్రత్యేక కోర్సు

- కరీంనగర్‌లో స్కిల్ సెంటర్ ఏర్పాటు చేస్తాం
- మంత్రి శ్రీధర్‌బాబు



విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న మంత్రి

కరీంనగర్ టౌన్, సెప్టెం బర్ 17: స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీలో విశ్వబ్రాహ్మణులకు ప్రత్యేక కోర్సును ప్రవేశపెడతామని రాష్ట్ర ఐటీ పరిశ్ర మలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విశ్వకర్మల శ్రమ లేనిదే విశ్వంలో ఏ పని జరుగదని అన్నారు. కరీంనగర్‌లో విశ్వకర్మ భవనం నిర్మించేందుకు ప్రభుత్వం స్థలం పరిశీలించాలని కలెక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, బీసీ సంక్షేమ అధికారి అనిల్ పాల్గొన్నారు.

గ్రామాల పరిశుభ్రత అందరి భాద్యత

తిమ్మాపూర్, సెప్టెంబరు 17: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత గ్రామస్థులందరి పైన ఉందని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని నల్లగొండలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని, ట్రీ గార్డులు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామంలో ఎన్ని మొక్కలు నాటుతున్నారని డీపీవోను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీపీవో రవీందర్, డీఆర్డీవో శ్రీధర్, యూనిసెఫ్ కో ఆర్డినేటర్ కిషన్‌స్వామి, యూనిసెఫ్ సభ్యులు రమేష్, వేణు, గ్రామ కార్యదర్శి తార పాల్గొన్నారు.

వంటనూనెలు సలసల



- భగ్గుమంటున్న బియ్యం, కూరగాయల ధరలు
- ఇబ్బందుల్లో పేద ప్రజలు

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 17: ప్రతి ఇంట్లో నిత్యం అవసరమయ్యే వంట నూనెల ధరలు సలసలా మసులుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం వంట నూనెలపై పన్నులను పెంచడంతో ఆ ప్రభావం పేదలపై పడింది. నిన్నమొన్నటి వరకు 111 రూపాయల వరకు ఉన్న లీటర్ వంట నూనె ప్యాకెట్ ధర 130 రూపాయలకు పెరిగింది. వంట నూనెలపై దిగుమతి సుంకం ప్రభుత్వం పెంచడంతో ధరలు పెరుగుతాయని ప్రచారం జరిగింది. వ్యాపారులు వంట నూనెలకు కృత్రిమ కొరత సృష్టించారు. దీంతో పాత ధరలతో కూడిన వంట నూనెల ప్యాకెట్లను ఎమ్మార్పీ కంటే 10 నుంచి 20 రూపాయలకు విక్రయించారనే ఆరోపణలు వచ్చాయి.కొత్త రేట్లతో ఉన్న వంట నూనె లీటర్ ప్యాకెట్లు, క్యాన్లను కంపెనీలు మార్కెట్‌లోకి విడుదల చేయడంతో కొత్త రేట్లను చూపిస్తూ పాత రేట్ల ప్యాకెట్లను విక్రయిస్తున్నారు. ఇప్పటికే బియ్యం, పప్పులు, ఉప్పులే కాదు కొన్ని రోజులుగా కూరగాయల ధరలు, చికెన్, మటన్ వంటి వాటి ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. దీంతో కడుపునిండా తినలేని పరిస్థితిలో పేద, మధ్యతరగతి విలవిలలాడుతున్నారు. రోజు కూలీనాలీ చేసుకొని జీవించే వారితోపాటు కనీస వేతనాలు కూడా అందనికార్మికులు, ఉద్యోగులు, నెలసరి ఖర్చులు, నిత్యావసర వస్తువుల ధరలతో కుటుంబాన్ని పోషించుకోవడమే భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిత్యావసరాల ధరలను తగ్గేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. మార్కెట్‌లో వంట నూనెల కృత్రిమ కొరత లేకుండా వ్యాపారులను కట్టడి చేయాలంటున్నారు.

'కాకతీయ' ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల



కాకతీయ కాలువ ద్వారా దిగువకు ప్రవాహిస్తున్న నీరు

తిమ్మాపూర్, సెప్టెంబరు 17: కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం నుంచి కాకతీయ కాలువ ద్వారా దిగువకు నీటి విడుదల కొసాగుతోంది. ఎల్‌ఎండీ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.903 టీఎంసీల నీరు ఉంది. మిడ్‌మానేరు నుంచి 3,136, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 1,569, మొత్తం 4,732 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. కాకతీయ కాలువ ద్వారా దిగువకు మూడు వేల క్యూసెక్కులు, మిషన్ భగీరథ, ఆవిరి రూపంలో 309, మొత్తం 3309 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉందని నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు.

గల్ఫ్ కార్మికులకు ఎల్లవేళలా అండగా ఉంటాం

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ఆది శ్రీనివాస్‌ను కలిసిన గల్ఫ్ కార్మిక సంఘాల నాయకులు

వేములవాడ, సెప్టెంబర్ 17 : జీవనోపాధి కోసం రాష్ట్రం నుంచి గల్ఫ్ దేశాలకు వలస వెళ్లి వివిధ రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో విలేకరు లతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదటి రోజు నుంచి గల్ఫ్ కార్మికుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి పరిష్కారం కోసం వివిధ దశలలో చర్చలు జరిపామన్నారు. గల్ఫ్ బోర్డు ఏర్పాటు, ఎన్నారై పాలసీ అమలుపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఈ నెల 14వ తేదీన హైదరాబాదులో పలువురు శాసనసభ్యులు, గల్ఫ్ కార్మిక సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నివేదించగా, ముఖ్య మంత్రి వెంటనే స్పందించి గల్ఫ్ సంక్షేమం కోసం నాలుగు అంశాలను అమలు చేస్తూ వెను వెంటనే జీవో విడుదల చేశారన్నారు. 2023 డిసెంబర్ 7వ తేదీ నుంచి ఏ కారణం చేతనైనా గల్ఫ్ దేశాల్లో మరణించిన కార్మికుల కుటుంబాలకు 5 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలి పారు. గల్ఫ్ కార్మికుల సమస్యలను విని పరిష్కరించేందుకు హైదరాబాద్ ప్రజాభవన్‌లో ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తామని, గురుకుల పాఠశాలు, కళాశాలలో గల్ఫ్ కార్మికుల పిల్లలకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. గల్ఫ్‌లో మృతి చెందిన వేములవాడ నియోజకవర్గ పరిధిలోని ఇద్దరు కార్మికులకు 5 లక్షల రూపాయల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించామన్నారు. టీఆర్ఎస్ నాయకులు గల్ఫ్ కార్మికులను మోసం చేశారన్నారు. గల్ఫ్ కార్మిక సంఘం నాయకులు మంగళవారం వేములవాడ పట్టణంలోని క్యాంపు కార్యాల యంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలసి ధన్యవాదాలు తెలిపారు.

న్యూస్ బాక్స్

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా వరద

జగిత్యాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం వరద నీరు స్వల్పంగా వస్తోంది. ఎస్సారెస్పీలోకి 10,465 క్యూ సెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 10,465 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

27లోగా బీఎడ్ పరీక్ష ఫీజు చెల్లించాలి

గణేశ్‌నగర్, సెప్టెంబరు 17: ఎస్‌యూ పరిధిలోని బీఎడ్ రెండో సెమిస్టర్ విద్యార్థులు, ఎంఎడ్ రెండో, నాలుగో సెమిస్టర్ విద్యార్థులు ఈనెల 27లోగా పరీక్ష రుసుం చెల్లించాలని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్‌వీ శ్రీ రంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 500 రూపాయల అపరాధ రుసుంతో అక్టోబర్ ఒకటో తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. పరీక్షలను అక్టోబరులో నిర్వహించ నున్నట్లు ఆయన తెలిపారు.

చెట్లు నరికిన వ్యక్తికి జరిమానా

● ఫీల్డ్ అసిస్టెంట్‌కు మెమో

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 17 : మండల కేంద్రంలోని పల్లె ప్రకృతి వనంలో చెట్ల నరికివేతపై ఎంపీడీవో సత్తయ్య మంగళవారం విచారణ చేపట్టారు. చెట్లను నరికివేసిన వ్యక్తిని గుర్తించి వేయి రూపాయల జరిమానా విధించారు. విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఫీల్డ్ అసిస్టెంట్ నరేశ్‌కు మెమో జారీ చేశారు. నాటిన మొక్కలను కాపాడుకునేందుకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. చెట్లను నరికి వేస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో సత్తయ్య హెచ్చరించారు. ఎంపీవో రాజు, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

కలప చెట్లు నరికివేత

● పట్టుకున్న అటవీ శాఖ అధికారులు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు17 : మండలంలోని వేములకుర్తి గ్రామ శివారులో అక్రమంగా టేకు చెట్లు నరుకుతున్న వేములకుర్తి గ్రామానికి చెందిన వ్యక్తిని మంగళవారం ఇబ్రహీంపట్నం ఎఫ్ఎస్‌వో చైతన్యశ్రీ పట్టుకున్నారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గ్రామ శివారులోని రామాలయం సమీపంలో నాలుగు టేకుచెట్లను కొట్టివేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. అతడి వద్ద నుంచి కలప దుంగలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసి వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఆమె పెర్కొన్నారు.అక్రమంగా కలప తరలించిన, నరికేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఫలించిన ఆశలు

● గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం
● సమస్యలపై అధ్యయనానికి సలహా కమిటీ
● ప్రజాభవన్‌లో ప్రవాసీ ప్రజావాణి



సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 17 : గల్ఫ్ కార్మికుల ఆశలు ఫలించాయి. చాలా కాలంగా ఎదిరిచూస్తున్న ప్రవాస కార్మికుల సమస్యలకు దారిదొరికింది. గల్ఫ్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల మానిఫెస్టోలో ప్రకటించి నిరూపించింది. గల్ఫ్ కార్మికుల మృతుల కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం అందించాలని, గల్ఫ్ కార్మికుల సమస్యలపై అధ్యయనానికి సలహా కమిటీ ఏర్పాటు చేయాలని, ప్రజాభవన్‌లో ప్రవాసీ ప్రజావాణి కార్యక్రమం ఏర్పాటునకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వీటితో పాటు గల్ఫ్ కార్మికుల విద్యార్థులకు గురుకుల విద్యాలయాల్లో సీట్ల కేటాయింపునకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన డిసెంబరు 7, 2023నుంచి గల్ఫ్‌లో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ. 5లక్షల పరిహారం అందించనుంది. ఈ విధంగా

గల్ఫ్ కార్మికులకు తీరనున్న కష్టాలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ, జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల ప్రాంతాలకు చెందిన వేలాదిమంది యువత ఉపాధికోసం గల్ఫ్‌బాట పట్టారు. ఇందులో 75శాతం కార్మికులకు కష్టాలే నెలకొన్నాయి. మిగితా 25శాతం కార్మికులు గల్ఫ్ వెళ్లి మంచి ఫలితాలే సాధిస్తున్నారు. గల్ఫ్ కార్మికుల విద్యార్థులకు గురుకుల విద్యాలయాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించడంతో ప్రయోజనం చేకూరనుంది. గల్ఫ్ వెళ్లిన కార్మికుల్లో పనులు లేక వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. వీరి సంక్షేమంకోసం ప్రభుత్వం తీసుకుంటు న్న నిర్ణయాలు ఎంతో ఉపయోగపడనుంది. గల్ఫ్‌దేశాల్లో ఉన్న కార్మికుల కష్టాలు, కన్నీళ్లు, బాధలు తీరే అవకాశం ఉంటుంది.

గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం చొరవచూపడంతో గల్ఫ్‌దేశాల్లో ప్రవాస కార్మికులు సంబరాలు జరుపుకుంటున్నారు. గల్ఫ్ కార్మికుల సమస్యలపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెటారు. రాష్ట్రంలోని ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి గల్ఫ్ దేశాలకు వేలాది మంది కార్మికులు వెళ్లి జీవనోపాధి పొందుతున్నారు. ప్రధానంగా దుబాయ్, సౌదీ, కువైట్, బహ్రెయిన్, మస్కట్, ఖతర్, ఇరాక్ దేశాలకు వెళ్లిన ప్రవాస కార్మికులు అనేక కష్టాలు పడుతున్నారు. ప్రభుత్వం ఓ పాలసీని అమలులోకి తీసుకురావడంతో గత కొన్నేళ్లుగా గల్ఫ్ కార్మికులు పడుతున్న కష్టాలకు కొంత వెసులుబాటు లభించనుంది. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిలు గల్ఫ్ కార్మికుల సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడి దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలోనే గల్ఫ్ కార్మికుల ప్రతినిధులతో సీఎం పలుమార్లు సమావేశమై చివరకు కార్యరూపం దాల్చారు. దీంతో గల్ఫ్‌లోని దుబాయ్, సౌదీ అరేబియా, కువైట్, మస్కట్, బెహరాన్, ఇరాక్ తదితర దేశాల్లో ఉన్న వేలాది మంది గల్ఫ్ కార్మికుల్లో ఆశలు చిగురించాయి.

ఏజెంట్ల మోసాలకు అడ్డుకట్ట

గల్ఫ్ కార్మికుల సమస్యల అధ్యయనానికి సలహా కమిటీ వేయాలని నిర్ణయించడంతో ఏజెంట్ల మోసాలను అరికట్టనున్నారు. ఏజెంట్ల చేతిలో అనేకమంది కార్మికులు మోసపోయి గల్ఫ్ దేశాల్లో జైలు పాలయ్యారు. విజిట్ వీసాపై వెళ్లి చిక్కుల్లో పడ్డారు. వందలాదిమంది అప్పులపాలై పలువురు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు ఉన్నాయి. దీంతో ఏజెంట్ల మోసాలపై ప్రభుత్వం కఠిన చట్టాలను అమలు చేసే అవకాశం ఉంది. గల్ఫ్ దేశాల్లోని ఇండియన్ ఎంబసీల్లో హిందీ, ఇంగ్లీషు, తెలుగు మాట్లాడే అధికారులను నియమిస్తే కార్మికులకు ప్రయోజనం కలుగుతుందనే చర్చ ఉంది.

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం

హైడ్రాతో రాష్ట్ర వనరులను కాపాడుతాం
మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కరీంనగర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం కరీంనగర్ ఆర్‌అండ్ బీ గెస్ట్‌హౌజ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రుణమాఫీ చేయవద్దా, మహిళలకు ఉచిత ప్రయాణం వద్దా అంటూ ప్రతిపక్ష నాయకులను ప్రశ్నించారు. వీటి కోసమే రాష్ట్రం అప్పులు చేసేది అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వనరుల గురించి ప్రధాని మోదీకి తెలుసునని పేర్కొంటూ గత ప్రభుత్వం అప్పులు చేసి దుబారా చేశారని అన్నారు. ఈ ఐదేళ్లలో ఇచ్చిన ప్రతిహామీ అమలు చేస్తామన్నారు. హైడ్రా అనేది చెరువులు, వనరులు కాపాడడానికేనని, అక్రమంగా ఎవరు ఏ పనిచేసినా ఊరుకునేది లేదన్నారు. కొన్ని రాష్ట్రాలు తెలంగాణతో సహా అప్పుల్లో ఉన్నాయని ప్రధాని మోదీ చేసిన కామెంట్‌పై ఆయన స్పందిస్తూ బీజేపీ నేతగా మాట్లాడి ఉండవచ్చన్నారు. అనర్హత వేటుపై విలేకరులు అడిగిన


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

ప్రశ్నకు స్పందిస్తూ దీనిపై శాసనసభాపతి నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మాజీ ఎమ్మెల్యేలు పంపిణీ చేస్తే అధికారులపై చర్యలు తీసుకుంటామని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. ప్రజాపాలనలో ప్రజల అవసరాలను తీర్చే ప్రభుత్వం మాదన్నారు. గత ప్రభుత్వం 10 ఏళ్లలో మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను పూర్తి చేయలేదని విమర్శించారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు పూర్తి చేయాలి


మంత్రి శ్రీధర్‌బాబుకు పుష్పగుచ్ఛం అందచేస్తున్న టీఎన్‌జీవో జిల్లా నాయకులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 17: జిల్లా పరిషత్‌లో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు పూర్తి చేయాలని టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి కోరారు. మంగళవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుకు కారుణ్య నియామకాల అభ్యర్థులతో కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకాలు గత 8 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్ళారు. దీనిపై స్పందించిన మంత్రి వెంటనే సీఎంవో కార్యదర్శితో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, కోశాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, టీజీవో నాయకుడు మడిపెల్లి కాళీచరణ్, సర్దార్ హర్మిందర్‌సింగ్, రాజేశ్‌భరద్వాజ్, సుమంత్‌రావు, అఫ్జల్, నాల్గవతరగతి సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి, నోముల రాహుల్‌రెడ్డి, భాగ్య, ఆదిత్యవర్ధన్, షెస్బాజ్, రఘురామ, నచికేతరెడ్డి, అజిత్, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

నిజాం పాలనకు చరమగీతం పాడింది కమ్యూనిస్టులే

● సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి


అనభేరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి

భగత్‌నగర్, సెప్టెంబరు 17 : హైదరాబాద్ సంస్థానంలో నిజాం పాలనకు చర మగీతం పాడింది కమ్యూనిస్టు పార్టీయే అని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. మంగళవారం తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా కరీంనగర్‌లోని సీపీఐ కార్యాలయం ఎదుట జెండాను ఆవిష్కరించారు. అనంతరం సాయుధ పోరాట వీరుడు, సీపీఐ మొదటి కార్యదర్శి అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్రను వక్రీకరించాలని చూస్తే సీపీఐ పార్టీ చూస్తూ ఊరుకోదన్నారు. నిజాం పాలన నుండి విముక్తి కోసం బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి, మక్దూమ్ మొహియు ద్దీన్‌లు తెలంగాణ సాయుధ పోరాటానికి సెప్టెంబర్ 11న పిలుపునిచ్చారన్నారు. ఆ పిలునందుకుని వేలాది మంది తరలి వచ్చి వీరోచిత పోరాట ఫలితంగానే హైదరాబాద్ సంస్థానాన్ని నిజాం భారత దేశంలో విలీనం చేశాడన్నారు. పాలకులు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పొనగంటి కేదారి, కొయ్యడ సృజన్, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, జాగీరు సత్యనారాయణ, బుచ్చన్నయాదవ్, బోయిని తిరుపతి, పైడిపల్లి రాజు, కిన్నెర మల్లవ్వ, తాళ్లపల్లి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

చిగురుమామిడి, సెప్టెంబరు 17 : మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన పోలవేణి శ్రీనివాస్ (48) అనే వ్యక్తి మంగళవారం పాము కాటుతో మృతి చేందినట్లు ఎస్సై బండి రాజేశ్ తెలిపారు. శ్రీనివాస్ ఉదయం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. కరెంటు మోటరు పెట్టేందుకు వెళుతుండగా పాము కాటు వేసింది. కుటుంబసభ్యులు శ్రీనివాస్‌ను చికిత్స నిమ్మితం కరీంనగర్‌కు తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. శ్రీనివాస్ భార్య పోలవేణి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎల్ఎల్‌బీ నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, సెప్టెంబరు 17 : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఆగస్టు 2024లో నిర్వహించిన ఎల్ఎల్‌బీ నాలుగో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను మంగళవారం ఎస్‌యూ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్‌వీ శ్రీరం గప్రసాద్ విడుదల చేశారు. ఫలితాలు యూనివర్సిటీ వెబ్‌సైట్ www.satavahana.ac.inlZ చూసుకోవచ్చని తెలిపారు.

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి


కొండగట్టులో క్యూలైన్‌లో వస్తున్న భక్తులు

మల్యాల, సెప్టెంబరు 17 : కొండగట్టు అంజనేయస్వామి సన్నిదానం మంగళవారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా భక్తులు కొండపైకి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు జరిపారు. అనంతరం బేతాళడు, శ్రీరాములవారికీ పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో రామకృష్ణరావు, ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్ పర్యవేక్షించారు.

● 30న తలనీలాల టెండర్లు

కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో పోగు చేసే తలనీలాలకు ఈనెల 30న టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఈవో రామకృష్ణరావు తెలిపారు. మూడుసార్లు టెండర్లు నిర్వహించినప్పటికీ కాంట్రాక్టర్ల కుమ్మక్కుతో వేలం పెరగ కుండా వాయిదా పడుతూ వస్తున్న టెండర్‌ను మరోసారి కూడా 30న హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

క్రైం కార్నర్

గణపతి నిమజ్జన ఊరేగింపులో గొడవ..

● ఇందిరానగర్‌లో ముగ్గురికి కత్తిపోట్లు
● ఐదుగురి అరెస్టు


నిందితుల అరెస్టు చూపిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

కోల్‌సిటీ, సెప్టంబరు 17: గోదావరిఖని ఇందిరానగర్ వద్ద సోమవారం రాత్రి గణపతి నిమజ్జన ఊరేగింపులో వివాదం చోటు చేసుకుంది. ఊరేగింపులో ఇందిరానగర్‌కు చెందిన బాగ్ విష్ణు, అజర్, గోపాల్ అర్కిట్, వీర్ల సృజన్ తదితరులు రామాంజనేయ బార్ వద్ద నృత్యాలు చేస్తుండగా గాంధీనగర్‌కు చెందిన కాకినట్ల మణికంఠ అలియాస్ మణి, గద్దం అరుణ్ కుమార్ అలిసాయ్ సోనులు అటువైపుగా వచ్చారని, ఇందిరానగర్‌కు చెందిన విష్ణు, మరో ఇద్దరు వ్యక్తులతో గొడవ పడ్డారన్నారు. అనంతరం మణికంఠ, అరుణ్ కేసీఆర్ కాలనీకి చెందిన తాళ్లపల్లి మహేంద్ర, బోడ కౌశిక్ అలియాస్ సిద్దు, బోడ కార్తికేయలతో కలిసి వచ్చి కత్తులతో గణపతి ఊరేగింపులో ఉన్న ఇందిరానగర్ యువకులపై హత్యాయత్నం చేసినట్టు సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఈ ఘటనలో విష్ణు, గోపాల్, సృజన్‌లకు గాయాలయ్యాయన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేశామని, మణికంఠ, మహేంద్ర, అరుణ్ కుమార్‌లను మంగళవారం అరెస్టు చేసినట్టు ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. కార్తికేయ, కౌశిక్‌లు పరారీలో ఉన్నట్టు తెలిపారు. ఘటన జరిగిన వెంటనే నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన ఎస్ఐ రమేష్, కానిస్టేబుళ్లు తీట్ల శ్రీనివాస్ తదితరులు సీఐని అభినందించారు.

సింగరేణి కార్మికుడి మృతిపై కుమారుడి ఫిర్యాదు

● తల్లి, సోదరిపైనే అనుమానం..
● విచారణ జరుపుతున్న పోలీసులు

కోల్‌సిటీ, సెప్టెంబరు 17 : గోదావరిఖని ఐబీ కాలనీలో సోమవారం సింగరేణి కార్మికుడు బానోత్ హరిసింగ్ మృతిపై అనుమానాలున్నాయని, తన తల్లి దస్లి, సోదరి సునీత కారణం కావచ్చని, హరిసింగ్ కుమారుడు వెంకటేష్ పోలీసులకు మంగళవారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశారు. హరిసింగ్ మృతదేహంపై గాయాలు ఉండడం, మెడ చుట్టూ బలమైన గాయం ఉండడంతో పోలీసులు పలు కోణాల్లో విచారణ జరుపుతున్నారు.

రూ. 1.68 లక్షల నగదు చోరీ

కథలాపూర్, సెప్టెంబరు 17 : మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ నుంచి డ్రా చేసి బైక్‌లో పెట్టిన రూ 1.68 లక్షలను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం ఎత్తుకెళ్లారు. ఎస్సై నవీన్ కథనం ప్రకారం... తుర్తికి చెందిన పురె గంగనర్సయ్య అనే రైతుకు రుణమాఫీ కాగా ఆ డబ్బులను డ్రా చేసుకున్నాడు. ఆ డబ్బులు బైక్‌లో పెట్టి కొంత దూరంలో ఉన్న బేకరికి వెళ్లారు. కొంతసేపటికి వచ్చి చూసే సరికి డబ్బులు మాయమయ్యాయి. దీంతో రైతు లబోదిబోమని స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. చుట్టుపక్కన ఉన్న సీసీ పుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

మోటార్ వైర్ల చోరీ

భీమారం, సెప్టెంబరు 17: భీమారం మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ పంపుసెట్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్తున్నారు. దమ్మన్నపేట, మన్నెగూడెం, కట్లకుంట, భీమారం గ్రామాల రైతులు మోటార్లు బిగించుకుని వ్యవసాయానికి నీరు వాడుతున్నారు. రాత్రి వేళ సమయాల్లో వ్యవసాయ పంపుసెట్ల మోటార్ వైర్లతో పాటు కాపర్ వైరును దొంగలు ఎత్తుకెళ్తున్నారు. రైతులు ఉదయాన్నే పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లి చూడగా ఫ్యూజులు తీసివేసి వైరు కత్తిరించుకుపోవడంతో రైతులు ఒక్కసారిగా షాక్‌కు గురవుతున్నారు. వరి పంటసాగు సమయంలో ఇలా జరుగడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరచూ కాపర్ వైరును దొంగలు ఎత్తుకెళ్లడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దొంలను పట్టుకుని కఠినంగా శిక్షించాలని రైతులు కోరుతున్నారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

చందుర్తి, సెప్టెంబర్ 17: చందుర్తి మండలం ఎన్గల్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. వేములవాడ రూరల్ మండలం హన్మాజీ పేటకు చెందిన గడ్డం కిషన్‌రెడ్డి ఎనగల్ గ్రామం వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, చందుర్తి మండలం బండపల్లి గ్రామానికి చెందిన నేదురి ఎల్లయ్య ద్విచక్ర వాహనంపై వేములవాడ వైపు వెళ్తూ ఎనగల్ శివారులో ఎదురెదురుగా ఢీకొన్నారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పిచ్చి కుక్క దాడిలో..

కోనరావుపేట, సెప్టెంబర్ 17 : కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామంలో మంగళవారం పిచ్చి కుక్క దాడి చేయగా ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామంలో పుల్కం జలందర్, తిక్కల రూప్సీ ఇంటి ముందు ఆడుకుంటుండగా పిచ్చికుక్క దాడిచేసి గాయపరిచింది. వెంటనే గమనించిన గ్రామస్థులు చిన్నారులను కాపాడారు. వైద్యం నిమిత్తం కోనరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

కేశనపల్లిలో డీజే సీజ్

ముత్తారం సెప్టెంబర్ 17: మండలంలోని కేశనపల్లిలో సోమవారం రాత్రి అనుమతిలేకుండా డీజే సౌండ్ బాక్స్‌లు ఏర్పాటు చేయడంతో పోలీసులు వాటిని సీజ్ చేశారు. సోమవారం నిమజ్జన ఊరేగింపు జరుగుతుండగా గ్రామానికి చెందిన ఓ పార్టీ మాజీ ప్రజాప్రతినిధి అనుమతి లేకుండా డీజే సౌండ్ బాక్స్‌లు ఏర్పాటు చేసి మహిళలను చూస్తూ అసభ్యకరంగా వ్యవహరించాడు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో డిజే సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

కరాటేలో అల్ఫోర్స్ విద్యార్థులకు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, సెప్టెంబరు 17: కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో అల్ఫోర్స్ విద్యార్థులు బంగారు, రజత పతకాలు సాధించారు. మంగళవారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో పతకాలు సాధించిన విద్యార్థులను అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించడానికి పాఠశాల స్థాయి నుంచే క్రీడలకు ప్రాముఖ్యత ఇస్తున్నామన్నారు. అల్ఫోర్స్ విద్యార్థులు ఎస్.సిద్విక్, తోట సాన్వి, కె సాయి తన్వి, ఆర్ శివరణ్య సెగహ, పి శత్రుమ్న బంగారు, రజత పతకాలను సాధించారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మిక కుటుంబాలకు సర్కారు బాసట

-మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

కరీంనగర్ అర్బన్/తిమ్మాపూర్, సెప్టెంబరు 17: గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న తెలంగాణ కార్మికులు, ఉద్యోగులు వారి కుటుంబ సభ్యుల కోసం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు సాధారణ పరిపాలన విభాగం(ఎన్‌ఆర్‌ఐ) ఈనెల 16న ఉత్తర్వులు(జీవోఎంఎస్ నెం.205) జారీ చేసిందని ఆయన తెలిపారు. బహ్రెయిన్, కువైట్, ఇరాక్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి గల్ఫ్ దేశాల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి అనేక మంది కార్మికులు పనిచేస్తున్నారని ఆయన తెలిపారు. చాలా ఏళ్లుగా గల్ఫ్ దేశాల్లోనే పని చేస్తున్న కార్మికులు పని ప్రదేశాల్లో జరిగే ప్రమాదాల వల్లనో, అనారోగ్య కారణాల వల్లనో కొందరు మృత్యువాత పడుతున్నారన్నారు. అలాంటి బాధిత కుటుంబాలకు ప్రభుత్వపరంగా ఆదుకోవాలనే ఉద్దేశంతో 5లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించేందుకు నిర్ణయించిందని ఆయన వివరించారు. 2023 డిసెంబరు 12వ తేదీ నుంచి 5 లక్షల ఎక్స్ గ్రేషియా పొందేందుకు అర్హులని ఆయన పేర్కొన్నారు. గల్ఫ్ కార్మికుల సమస్యలు, సంక్షేమాన్ని అధ్యయనం చేయడానికి ఒక సలహా కమిటీ నియమిస్తున్నదని కవ్వంపల్లి తెలిపారు.

'మున్సిపల్ కార్మికుల సేవలు భేష్'

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 17: గణేష్ నవరాత్రి ఉత్సవాలలో మున్సిపల్ కార్మికుల సేవలు భేష్‌గా ఉన్నాయని కాంగ్రెస్‌పార్టీ 30వ డివిజన్ అధ్యక్షులు దొంతి గోపి కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌కు మంగళవారం దొంతి గోపి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. కార్మికులు ఎంతో కష్టపడి గణేష్ మండపాల వద్ద చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తూ భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా పనిచేశారని తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు లింగంపల్లి బాబు, పొన్నం మధు, పోరండ్ల రమేష్, మహ్మద్ అమేర్, దిలీప్, అనిల్ ఆశిక్‌పాషా తదితరులున్నారు.

కరాటేలో ఎస్‌వీజేసీ విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ఎస్‌వీజేసీ డైరెక్టర్లు

కరీంనగర్‌స్పోర్ట్స్, సెప్టెంబరు 17: అంబేద్కర్ స్టేడియంలో ఈనెల 15న జరిగిన ఆల్ ఇండియా కరాటే ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో కరీంనగర్ శ్రీ వెంకటేశ్వర బాలుర జూనియర్ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థి శిలవేరు పవన్ కుమార్ అండర్-17 విభాగంలో ఇండివిజువల్ కటాలో ద్వితీయ స్థానం, కుమిటి విభాగంలో ప్రథమస్థానాలు కైవసం చేసుకున్నాడు. కళాశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరిక్రిష్ణ, వంగల సంతోష్ రెడ్డిలు పవన్‌కుమార్‌ను అభినందించారు.

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లికి క్షీరాభిషేకం



హుజూరాబాద్ మండలంలోని పెద్దపాపయ్యపల్లిలో తెలంగాణతల్లి విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబరు 17: రాష్ట్ర సచివాలంలో రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటును నిరసిస్తూ మండలంలోని పెద్దపాపయ్యపల్లి, కందుగుల గ్రామాల్లో తెలంగాణ తల్లి విగ్రహాలకు బీఆర్‌ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఐలయ్య, నాయకులు పాల్గొన్నారు.

● సైదాపూర్, గన్నేరువరం: సైదాపూర్, గన్నేరువరంలో బీఆర్‌ఎస్ నాయకులు తెలంగాణ తల్లి చిత్ర పటానికి క్షీరాభిశేకం నిర్వహించారు.

● తిమ్మాపూర్: మండలంలోని మన్నెంపల్లిలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేష్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు.

● చిగురుమామిడి: సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడం సిగ్గుచేటని బీఆర్‌ఎస్ నాయకుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిన్నముల్కనూర్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు.

ఘనంగా ప్రధాన మంత్రి జన్మదిన వేడుకలు

భగత్‌నగర్, సెప్టెంబరు 17: ప్రధాని మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని చైతన్యపురి ప్రధాన రహదారి వెంట బీజేపీ శ్రేణులతో కలిసి మొక్కలు నాటారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను విద్యానగర్ వినాయక చౌక్ వద్ద బీజేపీ నాయకుడు నరహరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

● వీణవంక: మండల కేంద్రంలో నిర్వహించిన కార్యాక్రమంలో మండల అధ్యక్షుడు రామిడి ఆదిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

● హుజూరాబాద్, ఇల్లందకుంట, జమ్మికుంటలో ప్రధాని జన్మదినం సందర్భంగా బీజేపీ నాయకులు స్వీట్లు పంపిణీ చేసి మొక్కలు నాటారు.

● రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేటలో బీజేపీ నాయకులు పీహెచ్‌సీలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు.

మొక్కలు నాటడం ప్రతీ ఒక్కరి బాధ్యత



ఇల్లందకుంటలో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో పుల్లయ్య

ఇల్లందకుంట, సెప్టెంబరు 17: మొక్కలు నాటడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని ఎంపీ డీవో పుల్లయ్య అన్నారు. స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా ఆయన మండల కేంద్రంలోని రహదారికి ఇరువైపులా మంగళవారం మొక్కలు నాటారు.

● శంకరపట్నం: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా కేశవపట్నం జడ్పీ హెచ్‌ఎస్‌లో ఎంపీడీవో కృష్ణప్రసాద్ మంగళవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీవో శారద, పంచాయతీ కార్యదర్శి నర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రజాపాలన దినోత్సవం



జాతీయజెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి



చొప్పదండిలో జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే సత్యం



జాతీయ పతాకానికి వందనం చేస్తున్న మేయర్

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 17: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరంలోని పలు ప్రభుత్వ కార్యాలయంలో మంగళవారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈకార్యక్రమానికి కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్క రించగా జడ్పీ సీఈవో, పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. కలెక్టరేట్‌లో జాతీయ జెండాను అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్ ఆవిష్కరించారు. కరీంనగర్ అర్బన్ బ్యాంకులో బ్యాంకు పీఐసి చైర్‌పర్సన్, జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి రామానుజా చార్య, పర్సన్ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి పాల్గొన్నారు.

●నగరపాలక సంస్థలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, కమిషనర్ చాహత్‌బాజ్‌పాయి, పాలకవర్గ సభ్యులతో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గుగ్గిళ్ళ జయశ్రీశ్రీనివాస్, గంట కల్యాణి శ్రీనివాస్, అర్ష కిరణ్మయి మల్లేశం, ఆకుల నర్మద నర్సయ్య, కోల మాలతి సంపత్, కంసాల శ్రీనివాస్, వాల రమణారావు, అడిషనల్ కమిషనర్ సువార్త, డిప్యూటీ కమిషనర్ స్వరూపరాణి, అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్ పాల్గొన్నారు.

●కరీంనగర్ క్రైం: పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస రావు, ఎస్‌బీఐ సృజన్‌రెడ్డి, ఆర్‌ఐలు కుమారస్వామి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

●జిల్లా జైలులో జైలు సూపరింటెండెంట్ శ్రీనివాస్ జాతీయపతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో జైలు వైద్యాధికారి వేణుగోపాల్, జైలర్లు శ్రీనివాస్, బి రమేష్ పాల్గొన్నారు.

●కరీంనగర్ అర్బన్: డీసీసీ కార్యాలయంలో మానకొండూరు ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కోమటి రెడ్డి పద్మాకర్‌రెడ్డి, మడుపు మోహన్, చర్ల పద్మ, ముస్తాక్ అహ్మద్ పాల్గొన్నారు.

●కరీంనగర్‌లోని సుడా కార్యాలయంలో చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సుడా వైస్ చైర్మన్, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ పాల్గొన్నారు.

●గణేశ్‌నగర్: టీజీఎస్పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయంలో ఎస్‌ఈ వడ్లకొండ గంగాధర్ జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో డీఈలు విజయేందర్ రెడ్డి, రాజం పాల్గొన్నారు.

●శాతవాహన యూనివర్సిటీ ఈస్ట్‌గేట్ వద్ద ఏబీవీపీ రాష్ట్ర కార్యాసమితి సభ్యులు జెల్లపెల్లి అంజన్న జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు వీరబాబు, సాగర్, దినేష్, నరేష్ పాల్గొన్నారు.

●భగత్‌నగర్: కొత్తపల్లి మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ రుద్ర రాజు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సరస్వతి పాల్గొన్నారు.

● కరీంనగర్ ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణలో రీజినల్ మేనేజర్ సుచరిత జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి రీజినల్ మేనేజర్స్ ఎస్ సత్యనారాయణ, ఎస్ భూపతిరెడ్డి పాల్గొన్నారు.

●సుభాష్‌నగర్: స్థానిక టీఎన్‌జీవో భవన్‌లో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, కేంద్ర సంఘం ఉపాధ్యక్షుడు నాగుల నరసింహస్వామి పాల్గొన్నారు.

●తెలంగాణ ఉద్యమకారుల ఐక్య ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారులను సన్మానించారు. కార్యక్రమంలో గందె కొమురయ్య, రవీందర్, గుల్ల కొమురయ్య పాల్గొన్నారు.

●కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండల పరిషత్ కార్యలయంలో ఆర్‌డీఓ మహేశ్వర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజు జెండాను ఆవిష్కరించారు. నగునూర్‌లో ఎంపీడీవో సంజీవరావు, చేగుర్తిలో యంపీఓ జగన్మోహన్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు.

●హుజూరాబాద్/శంకరపట్నం/చొప్పదండి/మానకొండూర్/ఇల్లందకుంట/గంగాధర/సైదాపూర్/చిగురుమామిడి/రామడుగు/వీణవంక: చొప్పదండి లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి పథకంలో భాగంగా 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ ప్రొసీడింగులను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. హుజూరాబాద్, శంకరపట్నం, మానకొండూర్, ఇల్లందకుంట, గంగాధర, సైదాపూర్, చిగురుమామిడి, రామడుగు, వీణవంకలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు జాతీయ జెండాలను ఎగురవేశారు.



జాతీయ పతాకానికి వందనం చేస్తున్న సుడా చైర్మన్



మానకొండూర్‌లో జాతీయ జెండాకు వందనం చేస్తున్న డీఆర్డీవో పీడీశ్రీధర్



గంగాధరలో జెండా వందనం చేస్తున్న ఏఎంసీ చైర్మన్

అందరూ మొక్కలు నాటాలి

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్17: అందరూ మొక్కలు నాటాలని ఎంపీడీవో సంజీవరావు అన్నారు. కరీంనగర్ మండలంలో స్వచ్ఛ తాహీ సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో అమ్మ పేరు మీద ఒక మొక్క కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో సంజీవరావు, యంపీఓ జగదీశ్వర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి బి.సత్యం, ఏపీఓ శోభరాణి పాల్గొన్ని మొక్కలు నాటారు. అనంతరం గ్రామాల్లో మొక్కలు నాటి ప్రతి ఒక్కరూ అమ్మ పేరు మీద ఒక మొక్క నాటాలని ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో సంజీవరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమం మంగళవారం నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు జరగనుందని తెలిపారు. రోజు వారి కార్యక్రమాల్లో భాగంగా పారిశుధ్యంపై అవగాహన, వ్యాసరచన పోటీలు, శ్రమదానం ద్వారా అంగన్‌వాడీలలో స్వచ్ఛత, ఆరోగ్యంపై అవగాహన, ప్రతి ఇంటిలో డ్రై డేను పాటించుట, తడి, పొడి చెత్త వేరు చేసి ట్రాక్టర్‌కు అందజేయుట వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి

భగత్‌నగర్, సెప్టెంబరు 17: తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. మంగళవారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సమావేశం ముకుందలాల్ మిశ్రా భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా అనభేరి ప్రభాకర్ రావు విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్ర మంలో వర్ధ వెంకటరెడ్డి, జి బీమా సాహెబ్, సుంకరి సంపత్, మక్కపెల్లి పూజ, కోనేటి నాగమణి, తిప్పారపు సురేష్ పాల్గొన్నారు.

●మానకొండూర్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించి రాజకీయ లబ్ధి పొందాలని బీజేపీ కుట్రలు చేస్తోందని సీపీఎం జిల్లా కమిటి సభ్యులు సుంకరి సంపత్ ఆరోపించారు. మానకొండూర్‌లోని రైసుమిల్లుల వద్ద మంగళవారం తెలంగాణ రైతాంగ పాయుధ పోరాట వార్షికోత్సవ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో నాయకులు గట్టు సతీష్, శాతరాజు భద్రయ్య, వెంకటేష్, బండి సంపత్, రాములు, పిట్టల సంపత్, గట్టు కొమురయ్య, రమేశ్ ఉన్నారు.



అనభేరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మిల్కూరి వాసుదేవరెడ్డి

విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

భగత్‌నగర్, సెప్టెంబరు 17: తెలంగాణ విమోజన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో జాతీయజెండాను ఎగురవేసి సర్దార్ వల్లభాయ్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, బాస సత్యనారాయణరావు, గుగ్గిళ్లపు రమేష్ పాల్గొన్నారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కమాన్ చౌరస్తాలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ కార్యదర్శి అదిమూలం విద్యాసాగర్, గర్రెపల్లి అంజనేయులు, నగర అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు. నగరంలోని వావిలాలపల్లి 41వ డివిజన్‌లో బీజేపీ టౌన్ వన్ కో-కన్వీనర్ కొమ్మెర రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన వేడుకలు నిర్వహించారు.

● హుజూరాబాద్: పట్టణంలోని డీసీఎంఎస్ కాంప్లెక్స్‌లో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో శేషయ్య, శ్రీనివాస్, సదానందం, సుధాకర్‌రావు, శ్రీనివాస్, వేణు, రాజు, రాజశేఖర్, సంజీవ్, బొరగాల సారయ్య, దేవేంద్ర, సమ్మయ్య, కొండాల్‌రెడ్డి పాల్గొన్నారు.

● ఇల్లందకుంట: మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద బీజేపీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో విమోచన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, షఫీఖాన్, రాంబాబు, సమ్మయ్య పాల్గొన్నారు.



కరీంనగర్‌లో జెండా వందనం చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

● జమ్మికుంట: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పట్టణాధ్యక్షుడు జీడీ మల్లేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో రవి, రాజేష్, మధు, స్వామి, స్వరూప, సుధాకర్‌రెడ్డి, రాకేష్, రాజు పాల్గొన్నారు.

వొడితెల శారదాదేవి వర్ధంతి

జమ్మికుంట, సెప్టెంబరు 17: పట్టణంలో రాజ్యసభ మాజీ సభ్యుడు వొడితెల రాజేశ్వర్‌రావు సతీమణి శారదాదేవి వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. సాయి మానసిక దివ్యాంగుల పాఠశాలలో అన్నదానం చేశారు. కార్యక్ర మంలో కృష్ణస్వామి, బుచ్చిబాబు, సంతోష్, బాబాన్న, రాములు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా నాగరాజు

రామడుగు, సెప్టెంబరు 17: రామడుగు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా దేవరాజు నాగరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 16 మంది ఉపాధ్యాయులు సైతం బాధ్యతుల స్వీరించారు. మంగళవారం మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థులకు సౌకర్యాలు అందేలా చూస్తానని నాగరాజు అన్నారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి

తిమ్మాపూర్, సెప్టెంబరు 17: సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మండల నాయకులకు సూచించారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విమోచన దినోత్సవం జరపకుండా ప్రజాపాలన పేరుతో వేడుకలు నిర్వహించడం శోచనీయమన్నారు. ప్రతి బూత్‌లో 200కు పైగా సభ్యత్వాలను చేయించి బీజేపీని బలపర్చాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, మండల అధ్యక్షుడు జగదీశ్వరాచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి, నాయకులు గడ్డం అరుణ్, దండు కొమురయ్య, బూట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

రామడుగు, సెప్టెంబరు 17: మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ పాఠశాలలో చదువుతున్న వంశీక, సంహిత, సృజన, హర్ష, కార్తీక్, సుశాంత్ రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీరు కురిక్యాలలో నిర్వహించబోయే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. విద్యార్థులను అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి అభినందించారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

హుజూరాబాద్, సెప్టెంబరు 17: పట్టణంలోని విశ్వకర్మ మనమయ సంఘం ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వకర్మ జయంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.

● శంకరపట్నం: మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణ మండల సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతిని జరుపుకున్నారు. ఈ సందర్భంగా గణపతిపూజ, వీరబ్రహ్మేంద్ర స్వామి పూజ పతాక ఆవిష్కరణ, అష్టదిక్పాలక పూజ, విశ్వకర్మయజ్ఞం, పూర్ణాహుతి నిర్వహించారు.

● చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్‌లో విశ్వకర్మ యజ్ఞాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెల్లోజు సత్యనారాయణ,రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లోజు రాజు,మాజీ సర్పంచులు చిలుక లింగయ్య, కర్రె శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ ముద్దసాని రంగన్న పాల్గొన్నారు.

● గంగాధర: విశ్వకర్మ మనుమయ సంఘ ఆధ్వర్యంలో గంగాధర ప్రధాన రహదారి నుంచి ర్యాలీ నిర్వహించి విశ్వకర్మ భగవానుడికి పూజలు చేశారు.

● చిగురుమామిడి: మండలంలోని సుందరగిరిలో, పలు గ్రామాల్లో విశ్వకర్మ పూజా మహోత్సవాన్ని నిర్వహించారు.



శంకరపట్నంలో పూజలు చేస్తున్న విశ్వబ్రాహ్మణులు

● రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో విశ్వకర్మ జయంతిని విశ్వబ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శోభాయాత్ర నిర్వహించారు.

గణేశ్ నిమజ్జనం

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 17: కరీంనగర్ శివారులోని తీగలగుట్టపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణనాథుడి నిమజ్జనాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం గణనాథున్ని సైకిల్‌పై శోభాయాత్ర చేపట్టి గ్రామ శివారులోని చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, మమత, వినోద, మంగ, శ్రీలత, విజయలక్ష్మీ, మెహర్ ఉన్నిసా తదితరులు పాల్గొన్నారు.

●చిగురుమామిడి: మండలంలో పలు గ్రామాల్లో మంగళవారం గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా ఎస్‌ఐ బండి రాజేశ్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

● రామడుగు: మండలంలోని పలు గ్రామాల్లో గణేష్ నిమజ్జనోత్సవం ఘనంగా జరిగింది. గోపాల్‌రావుపేటలో పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహంతోపాటు గుండి తదితర గ్రామాల్లో నిమజ్జన కార్యక్రమాలు జరిగాయి.

'మతిభ్రమించి మాట్లాడుతున్న కౌశిక్‌రెడ్డి'

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు17: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మతి భ్రమించి మాట్లాడుతున్నాడని టీపీసీసీ మాజీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ముల్కాల ప్రవీణ్ మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. సర్పంచ్‌గా పోటీ చేయని అతనికి కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చిందని, ఎమ్మెల్యేగా హుందాగా ఉండడం మరిచి వీధి రౌడీలాగా మాట్లాడుతుండటం దారుణమన్నారు.

వనపర్తి ఎస్పీకి పితృవియోగం

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 17: వనపర్తి జిల్లా పోలీస్ సూపరిండెంట్(ఎస్పీ) రావుల గిరిధర్ తండ్రి రావుల నిరంజనాచారి మంగళవారం తెల్లవారుజామున ఆకస్మికంగా కరీంనగర్‌లోని తన స్వగృహంలో మరణించారు. కరీంనగర్ జిల్లా సహకార శాఖలో ఉన్నతాధికారిగా పనిచేసిన నిరంజనాచారి(84)కి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. పెద్ద కుమారుడు రావుల శశిధర్ తెలంగాణ రాష్ట్ర కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌లో జాయింట్ కమిషనర్‌గా హైదరాబాద్‌లో పనిచేస్తుండగా రెండో కుమారుడు రావుల గిరిధర్ వనపర్తి జిల్లా ఎస్పీగా పనిచేస్తున్నారు. కరీంనగర్‌లో నిరంజనాచారి అంత్యక్రియలు నిర్వహించారు.

తెలంగాణ అమరవీరులకు టీడీపీ నివాళి

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు17: భారత దేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విలీనం చేసిన సెప్టెంబర్ 17ను పురస్కరించుకొని తెలుగుదేశం పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ మాజీ ఇంచార్జి కల్యాడపు ఆగయ్య ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించి, తెలంగాణ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు సందబోయిన రాజేశం, రొడ్డ శ్రీనివాస్, హైగ్రీవాచారి, ఎర్రవెల్లి రవీందర్, ఎలిమెళ్ళ కిషన్, ఇట్టి మల్లేశం, రొడ్డ శ్రీధర్, ఎస్‌కె హైమద్, ఎర్రవెల్లి వినీత్, బోగ సీతయ్య, ఎండి జెలీలొద్దీన్, మేకల్ రవికిరణ్, బుర్ర రాంచంద్రంగౌడ్, టి.ప్రసన్నం, మేకల రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు 137వ ఎన్నీల ముచ్చట్లు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 17: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 6గంటలకు రచయిత ఎర్రోజువేంకటేశ్వర్లు నివాసంలో 137వ ఎన్నీల ముచ్చట్లు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.కవులు, రచయితలు తమ రచనలతో సూర్యనగర్-3, ఆర్టీసి వర్క్ షాపు వద్ద గల ఎర్రోజు వేంకటేశ్వర్లు నివాసానికి హాజరు కావాలని కోరారు.

అంతర్జాతీయ సూక్ష్మ శాస్త్ర దినోత్సవం

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 17: కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో అంతర్జాతీయ సూక్ష్మ శాస్త్ర దినోత్సవం ను ఘనంగా నిర్వహించారు. సూక్ష్మ జీవుల వలన కలిగే వ్యాదులను తీసుకోవలసిన చర్యల గురించి అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా.జి సమత, సీనియర్ అధ్యాపకులు డా.డి శ్రీహరి, ఆఫీస్ సూపరిండెంట్ టి సురేష్ కుమార్, పద్మజ, వెంకటేశ్వర్లు, శంకరయ్య సూక్ష్మ జీవ శాస్త్ర విభాగాధి పతి కె గీతారాణి, సూక్ష్మ జీవ శాస్త్ర అధ్యాపకులు కె.ప్రవిత, అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

ముగిసిన కరీంనగర్ అర్బన్ జోన్ క్రీడలు

కరీంనగర్ స్పోర్ట్స్ సెప్టెంబరు 17: కరీంనగర్ అర్బన్ జోన్ పాఠశాలల క్రీడా సమాఖ్య క్రీడలు మంగళవారం నాడు ముగిసాయి. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన ఈ పోటీల్లో అర్బన్ జోన్‌లోని అండర్14, అండర్17 బాల బాలికలకు పోటీలను నిర్వహించారు. 128 కబడ్డీ జట్లు, 96 వాలీబాల్ జట్లు, 146 ఖోఖో జట్లు పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటాయి. ఈ పోటీల ముగింపు కార్యక్రమానికి కోటా ఇనిస్టూట్ ఆఫ్ డైరెక్టర్ కోట అంజిరెడ్డి ముఖ్య అతిదిగా హజరై విజేతలకు బహుమతులను అందజేశారు.

స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం

హుజూరాబాద్ రూరల్, సెప్టెంబరు 17: మండలంలోని కందుగులకు చెందిన స్వాతంత్ర్య సమరయోధులు కంకణాల రాజిరెడ్డి, జాలి వెంకట్‌రాజిరెడ్డి, రొంటాల మల్లారెడ్డి, కదర్ల జనార్దనాచారిని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సన్మానించారు. తెలం గాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని హైద్రాబాద్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో వారిని సన్మానించారు.

ఘనంగా పెరియార్ జయంతి

హుజూరాబాద్, సెప్టెంబరు 17: పట్టణంలోని విజ్ఞాన వికాస కేంద్రంలో పెరియార్ ఈవీ రామస్వామి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవీ రామస్వామి చిత్రపటానికి నివాళులర్పించారు. వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పేరియర్ ఈవీ రామ స్వామి జయంతి సందర్భంగా కేక్ కట్ చేశారు.

పిచ్చి కుక్క దాడిలో ఐదుగురికి గాయాలు

వీణవంక, సెప్టెంబర్ 17: మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో పిచ్చి కుక్క దాడిలో ఐదుగురు గాయపడ్డారు. మంగళవారం గ్రామంలో ఓ పిచ్చికుక్క రోడ్డుపై వెళుతున్న ఉయ్యాల లక్ష్మి, ముంజల సత్యం, వంగ రమేష్, వొల్పుల సమ్మిరెడ్డి, రాచర్ల శివపై దాడి చేసింది. గ్రామస్థులు వారిని ఆస్పత్రికి తరలించారు.

సభ్యత్వ నమోదు ప్రారంభం

చొప్పదండి, సెప్టెంబర్ 17: మహిళా కాంగ్రెస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చొప్పదండిలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న రెడ్డి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, మహిళా కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి నేరెళ్ల కవిత, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షరాలు గుంటి స్వరూప, కార్యకర్తలు పాల్గొన్నారు.

● సంక్షిప్త సమాచారం..

●గణేశ్‌నగర్: జిల్లాకు చెందిన గసిగంటి శ్రీలత ఉస్మానియా విశ్వ విద్యాలయం లైబ్రరీ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగంలో డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ప్రస్తుతం శ్రీలత తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాల సత్రాజ్పల్లి గ్రామం వేములవాడ మండలం రాజన్న సిరిసిల్ల జిల్లాలో లైబ్రేరియన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

●కరీంనగర్ కల్చరల్: కమాన్ చౌరస్తాలో గల పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వకర్మ భగవానుని బ్రహ్మోత్సవాలు ముగిసాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, ధర్మకర్తలు శ్రీరామోజు నాగరాజు, రవీంద్రాచారి, మియాపురం బ్రహ్మచారి పాల్గొన్నారు.